క్లుప్తంగా

వైఎస్సార్‌ను కలసిన సీపీఐ నేతలు



వైవీఆర్‌తో మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

గుంతకల్లుటౌన్: నాలుగు నెలల క్రితం సర్వైకల్ సర్జరీ చేయించుకుని హైదరాబాద్ నుంచి గుంతకల్లుకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పరామర్శించారు. శుక్రవారం వైవీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆరోగ్యం గురించి ఆరాతీశారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై చర్చించారు. సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాము, మహేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆదిదంపతులు



తాడిపత్రి రూరల్: స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వవాహనంపై భక్తులకు ఆదిదంపతులు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి.

కంది కొనుగోలు పునఃప్రారంభం



సొసైటీ కార్యాలయం వద్ద రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పుట్లూరు: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద కంది కొనుగోలును అధికారులు పునః ప్రారంభించారు. కేంద్రం మూసివేయడంపై ఫిబ్రవరి 28న 'మూన్నాళ్ల ముచ్చటగా కంది కొనుగోళ్లు' అనే వార్తను 'సాక్షి'లో ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన అధికారులు శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని తిరిగి ప్రారంభించారు. కాగా సొసైటీ కార్యాలయంలో ఉన్న కందులను గోడౌన్‌కు తరలించడంలో నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులకు పరిశోధనలు అవసరం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు సైన్స్‌కు సంబంధించిన పరిశోధనలు ఎంతో అవసరం అని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ దీపా సీతారామన్ సూచించారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం-2025ను పురస్కరించుకుని హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం, సెంట్రల్ లైబ్రరీ, (ఎడీఎల్ఐ) క్లబ్ సంయుక్తంగా థియరీ టు రియాలిటీ, సైన్స్ ట్రాన్స్‌ఫార్మరింగ్ ఎవరీ డే లైఫ్ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, హెచ్అండ్ ఎస్ విభాగం అధిపతి డాక్టర్ గురు సిద్దప్ప, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడిపత్రి రూరల్: స్థానిక ఎస్‌బీఐ సమీపంలో నివాసముంటున్న బాల గంగాధర్ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 28 బస్తాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటింటి నుంచి బాల గంగాధర్ సేకరించిన రేషన్ బియ్యాన్ని దోశపిండిగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకునేవాడిగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు.

నాటు సారా నిర్మూలనే ధ్యేయం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శివసాగర్

గుంతకల్లు: నాటు సారా నిర్మూలనే ధ్యేయమని ఎక్సైజ్ సీఐ జీ.శివసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో పట్టణంలోని బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా నాటు సారా నిర్మూలనకు పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నామన్నారు. సారా తయారీదారులకు బెల్లం విక్రయించినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారాకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారమివ్వాలన్నారు.

విధి వంచితుడు..!

- మేకల అపహరణతో సర్వం కోల్పోయిన బాధితుడు
- జీవాల రికవరీపై ఏళ్లు గడుస్తున్నా పోలీసుల మీనమేషాలు



తోపుడు బండిపై వ్యాపారం చేస్తున్న చెన్నకేశవులు

తాడిపత్రి రూరల్: అతనో విధి వంచితుడు. జీవితంలో ఎదుగుదల ఆశించి భంగపడ్డాడు. మేకలను అపహరించడానికి వచ్చిన దుండగులు తలపై కొట్టిన దెబ్బలకు జీవశ్చవంలా మారాడు. వివరాలు.. తాడిపత్రి పట్టణం నందలపాడుకు చెందిన చెన్నకేశవులు 15 ఏళ్ల క్రితం తోపుడు బండితో జీవిత పోరాటం ప్రారంభించాడు. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఆయన తాడిపత్రికి వచ్చి తోపుడు బండిపై దోస విత్తనాలు, పొద్దుతిరుగుడు విత్తనాలు విక్రయించేవాడు. భార్య, పిల్లలు లేక పోవడంతో ఒంటరి జీవితం గడుపుతూ ఉన్న దాంట్లో తృప్తి పడేవాడు. శ్రేయోభిలాషుల సలహా మేరకు తన వద్ద దాచుకున్న డబ్బుతో పాటు తెలిసిన వారి వద్ద అప్పు చేసి మేకల పెంపకం చేపట్టాడు.

మేకపోతు తెచ్చిన తంటా

ఈ సంఘటన 2017లో జరిగింది. తాడిపత్రి పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు వచ్చి మేకల మందలో బలిష్టంగా ఉన్న మేకపోతును విక్రయించాలని చెన్నకేశవులుపై ఒత్తిడి తెచ్చారు. ఇందుకు ఆయన నిరాకరించాడు. మేకపోతు విక్రయించకపోతే మేకలను మేపుకుంటావో చూస్తామంటూ బెదిరించి వెళ్లారు. ఆ బెదిరింపులను తేలికగా తీసుకున్న ఆయన రోజులాగే పెన్నానది పరివాహక ప్రాంతానికి మేకలను మేపుకోవడానికి వెళ్లాడు. అక్కడే పొంచి ఉన్న దుండగులు కర్రలతో చెన్నకేశవులుపై విచక్షణారహితంగా దాడి చేసి చనిపోయాడనుకుని తమ వెంట తెచ్చుకున్న వాహనంలో మేకలను ఎత్తుకెళ్లారు. తలతో పాటు శరీరమంతా గాయాలతో స్పృహ తప్పిపడిపోయిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి వివరాల మేరకు బెదిరించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ ఒత్తిడులు, ఇతర కారణాల వల్ల పోలీసులు కేసుతోపాటు నిందితుల అరెస్టు, మేకల రికవరీపై దృష్టి పెట్టలేదన్న ప్రచారం ఉంది.

రికవరీ కానీ మేకలు

జీవనాధారమైన మేకలను రికవరీ చేయడంతో పాటు తనపై దాడి చేసిన దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పోలీసు స్టేషన్ చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేసినా చెన్నకేశవులు గోడు పట్టించుకునేవారు కరవయ్యారు. దుండగులు కొట్టిన చావు దెబ్బలకు శరీరమంతా సహకరించని పరిస్థితిలో కూడా న్యాయం కోసం తెలిసిన వారిని, తెలియని వారితో పాటు రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి కన్నీటితో విన్నవించినా పట్టించుకునే నాథులే కరవయ్యారు. దీంతో శారీరకంగా, మానసికంగా కృంగిపోయాడు. మేకల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగం, వారి నుంచి ఒత్తిడులు అధికం కావడంతో పాటు వాటి కోసం తిరిగి తోపుడు బండి వ్యాపారాన్ని ప్రారంభించి జీవన పోరాటం ప్రారంభించాడు.

న్యాయం చేసేవారే కరువయ్యారు

నాకు జరిగిన అన్యాయంపై ఎన్ని విధాల ప్రయత్నించినా న్యాయం దొరకలేదు. నిందితుల గురించి పోలీసులకు చెప్పినా, జీవనాధారమైన మేకలను రికవరీ చేయించాలని ప్రాధేయపడినా నా మొర అలకించలేదు. వెంటాడిన దురదృష్టాన్ని తలచుకుంటూ తిరిగి తోపుడు బండి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. అప్పులు తీర్చడం తలకుమించిన భారమవుతోంది. తలకు తగిలిన దెబ్బలతో మానసికంగా అస్థలు పడుతున్నాను.

– చెన్న కేశవులు

అంకెల గారడీ బడ్జెట్

కూటమి ప్రభుత్వం అంకెల గారడీ బడ్జెట్‌తో ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. బడ్జెట్‌పై ఎవరు ఏమన్నారో వారి మాటల్లోనే..

మభ్య పెట్టారు



ఎన్నికల వాగ్దానాల్లాగే ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కా ప్రణాళికతో బడ్జెట్‌ను రూపొందించి ఇచ్చిన ప్రతి ఒక్క హామీనీ నెరవేర్చారు. అయితే గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ ప్రజలను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉద్యోగాల కల్పన, తదితర వాటికి సంబంధించి నిధుల కేటాయింపులో స్పష్టత లేదు. విద్యారంగానికి రూ.30వేల కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. ఇందులో ఉద్యోగుల జీతాలు ఉన్నాయో లేదో చెప్పలేదు. తల్లికి వందనం పథకం అమలుకు ఏటా రూ.13వేల కోట్లు అవసరం కాగా, రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారు. మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామన్న హామీ అమలు ఊసేలేదు. పింఛన్‌లు ఇస్తున్నామని చెబుతూనే.. ఇప్పటికే 1.50 లక్షల మందిని అనర్హులుగా పేర్కొంటూ అక్రమంగా తొలగించారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి, ఇవాళ కేంద్రం నిధులను కలుపుకుని ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీ-నీవా కాలువ వెడల్పునకు చొరవ తీసుకోలేకపోయారు.

– సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

దగా చేశారు



భారీ అంచనాలతో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ చివరకు కోతల బడ్జెట్‌గానే మిగిలింది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మరోసారి అన్ని వర్గాల ప్రజలను దగా చేసింది. సంక్షేమం పేరుతో కోతలు వేశారు. దీపం పథకానికి సంబంధించి 1.55 కోట్ల మందికి అందాల్సిన లబ్ధిని భారీగా కుదించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలను ఇస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా చేశారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకంలో భారీగా కోతలు విధించి రూ.10,400 కోట్లకు గాను బడ్జెట్‌లో రూ.6,300 కోట్లను కేటాయించి రైతాంగాన్ని మోసం చేశారు. ఇప్పటికైనా నా కూటమి ప్రభుత్వం నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించాలి.

– తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

నిరాశాజనకం



నిధులు కేటాయించకుండా పేద, బడుగు, బలహీన వర్గాల వారితో పాటు రైతులు, మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ఊసేలేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ నిధుల కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. ప్రస్తుత కేటాయింపులు ఏ మాత్రం సరిపోవు. 50 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళకు పెన్షన్ మంజూరు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. అన్నదాత సుఖీభవ పథకానికి కంటితుడుపు చర్యగా నిధులు కేటాయించారు. దీపం పథకాన్ని 90 లక్షల మందికే కుదించారు. సున్నా వడ్డీకి నిధులే లేవు. ధరల స్థిరీకరణ నిధికి రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇవి ఏ మాత్రమూ సరిపోవు. మొత్తానికి ఈ బడ్జెట్ అభివృద్ధి సూచికలో రాష్ట్ర తిరోగమనానికి నిదర్శనంగా నిలిచింది.

– వై. శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్

బడాయి బడ్జెట్



మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలనూ నిరాశపరిచింది. ఎన్నికల హామీలను గాలికొదిలేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి పథకాలకు బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదు. సంపద సృష్టి మాట దేవుడెరుగు... అప్పులు మాత్రం సృష్టించారు. అప్పులతోనే అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్నారు. తీరా బడ్జెట్‌లో నయాపైసా నిధులు కేటాయించలేదు. దీపం పథకానికి కోత విధించి 1.55 కోట్ల లబ్ధిదారులను 90 లక్షలకు కుదించి రూ.4వేల కోట్లకు గాను కేవలం రూ2,601 కోట్లు మాత్రమే కేటాయించారు. తల్లికి వందనం కింద రూ.25వేల కోట్లకు గాను కేవలం రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారు. డ్వాక్రా మహిళలకు రూ.10లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై స్పష్టత లేదు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇందుకు రూ10,400 కోట్లకు గాను బడ్జెట్‌లో రూ. 6,300 కోట్లు మాత్రమే కేటాయించి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లారు. గత ప్రభుత్వాన్ని విమర్శలు చేయడంపై ఉన్న శ్రద్ధ ప్రజాసంక్షేమంపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చూపలేదు. బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమ జిల్లాల ప్రస్తావన లేదు. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులపై సైతం కేశవ్ ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశపరిచింది. ఇది కేవలం కూటమి ప్రభుత్వ బడాయి బడ్జెట్‌గానే నిలిచింది.

– వై. విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

కాకిలెక్కలు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయలేక బడ్జెట్‌లో కాకి లెక్కలు చెబుతోంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయం చేశారు. సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడేలా సంక్షేమం పేరుతో కోతల నాటకానికి తెరతీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కీలక హామీలకు కూడా కోతలతో ఎగనామం పెట్టేలా అంకెల గారడీ చేస్తున్నారు.

భాస్కర్, జెడ్పీటీసీ బుక్కరాయసముద్రం

'కార్మికులను వేధించడం తగదు'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: కార్మికుల విషయంలో నియంతలా వ్యవహరిస్తున్న తాడిపత్రి మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు, కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, మునిసిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. కార్మికుల విషయంలో మునిసిపల్ కమిషనర్ అనుచితంగా వ్యవహరిస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక రాజకీయ అండ చూసుకుని ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ ఉద్యోగులు, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. గతంలో భీమవరం కమిషనర్‌గా పనిచేసినప్పుడు అవినీతికి పాల్పడి ఏసీబీకి పట్టుబడ్డారన్నారు. ఇక్కడ కార్మికుల పొట్టకొట్టి అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇక్కడి వ్యవహారాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి కమిషనర్ అవినీతి, కార్మికులతో అనుసరిస్తున్న తీరుపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ముత్తూజ, వెంకటనారాయణ, నాగరాజు, రామాంజనేయులు, తిరుమలేషన్, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

గుంతకల్లుగుంతకల్లుటౌన్/గుత్తి/పుట్లూరు/యల్లనూరు/తాడిపత్రి టౌన్/బుక్కరాయసముద్రం/పెద్దవడుగూరు/పామిడి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను ఎంఈఓలు ప్రారంభించారు. కొత్త ఆవిష్కరణలు, ఆలోచన రేకెత్తించే ఎన్నోరకాల రూపకల్పనలతో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ క్విజ్, వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దవడుగూరు: ఆర్థిక ఇబ్బందులు పడుతున్న స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. 2002-2003లో క్రిష్టిపాడు జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థి జయరాముడు క్యాన్సర్ బారిన పడి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు రూ.50 వేలు సేకరించి యాడికి మండలం రామన్నగుడిసె గ్రామంలో స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరిస్తాం



సమావేశానికి హాజరైన సభ్యులు

తాడిపత్రి రూరల్: వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా మునిసిపాలిటీ పరిధిలో మూలనపడ్డ ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరిస్తామని కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం 28వ వార్డు కౌన్సిలర్ రాగే జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. రాజీనామా చేసిన ఇరువురు మునిసిపల్ వైస్ చైర్మన్ల స్థానంలో కొత్త వారిని ఎన్నుకోక పోవడంతో పాటు చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం తన చాంబర్ నుంచి వెళ్లిపోవడంతో.. హాజరైన కౌన్సిలర్లు ఏకగ్రీవంగా అధికార పార్టీకి చెందిన రాగే జ్యోతి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా 40 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా మునిసిపాలిటీలోని వివిధ వార్డుల్లో ఉన్న ట్యాంకులను పునరుద్ధరిస్తామన్నారు. పట్టణంలోని నందలపాడు క్రాస్‌లో మురుగు సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించామన్నారు. పట్టణంలో కొత్తగా వీధి లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు పాత వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు.

టౌన్ బ్యాంకు సమావేశం రేపు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు సీఈఓ కేవీ రమాదేవి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలోని శ్రీకృష్ణ దేవరాయల కల్యాణ మండలంలో నిర్వహించనున్న సమావేశానికి సభ్యులు హాజరుకావాలన్నారు. సమావేశంలో 2025-26కు సంబంధించిన బడ్జెట్, బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, మొండి బకాయిలు తదితర అంశాలపై చర్చిస్తామని ఆమె తెలిపారు.

నిరుపేదలకు అండగా ఆర్డీటీ

శింగనమల: బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలకు ఆర్డీటీ అండగా ఉంటోందని ఆ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నిదనవాడలో ఆర్డీటీ నిర్మించిన గృహాలను స్పెయిన్ దేశీయులు ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో 80 గృహాలు నిర్మించామని, ప్రస్తుతం 17 గృహాలు నిర్మించామన్నారు. ఎటీఎల్ సుధాకర్ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఓ కృష్ణారెడ్డి, అమర్నాథ్, వన్నూరుస్వామి, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

'అనుమతిలేని ఫ్లెక్సీలను తొలగిస్తాం'

శింగనమల: పంచాయతీ అనుమతి లేని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలన్నింటినీ తొలగిస్తామని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. వెస్ట్ నరసాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేసిన ఫ్లెక్సీని పంచాయతీ అధికారులు గురువారం తొలగించడంతో శుక్రవారం విలేకరులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రతి ఫ్లెక్సీనీ తొలగిస్తామన్నారు. మాకు పార్టీలతో ఎలాంటి సంబంధం లేదన్నారు.

నిరుద్యోగులకు 'కూటమి' వెన్నుపోటు

గుంతకల్లు: కూటమి ప్రభుత్వ ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఊసేలేదని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన గుంతకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ అక్కడికే పరిమితం చేశారన్నారు. నాలుగు లక్షల ఉద్యోగులను ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకూ నాలుగు వేలు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.50 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్, సుభాష్‌రెడ్డి, తారకేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా బధిర పాఠశాల వార్షికోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ బధిరుల పాఠశాలలో 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ నవీద, ప్రధానోపాధ్యాయుడు ఎర్రిస్వామి, స్కిల్ కోఆర్డినేటర్ సుధీర్‌రెడ్డి, ఆడియాలజిస్ట్ నరేంద్ర, స్పానిష్ వలంటీర్ లోలా, పాఠశాల మేనేజర్ గీతా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హజరత్ సిద్దిబాషా దర్గా ఉరుసు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్ లైట్లతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు చేశారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలంలోని జెడ్పీ పాఠశాలలో 97 మంది విద్యార్థులకు ఉచితంగా ఉంటి అద్దాలను పంపిణీ చేశారు. శుక్రవారం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా తాడిపత్రి డివిజన్ జీపీఎంఓఓ మధుసూదన్‌రాజు, జిల్లా సివిల్ సర్జన్ సైదన్న ఆదేశాల మేరకు పెద్దపప్పూరు, గార్లదిన్నె, పెద్దెక్కలూరు, జెడ్పీ పాఠశాలల్లో కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సుదర్శనాచార్యులు, లక్ష్మన్న, బాల గుర్రప్ప, ఆదినారాయణరెడ్డి, మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న సీఐటీయూ కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సీపీఎం నాయకులు విద్యుత్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు జగ్గిలిరమేష్, రంగమ్మ, రామునాయక్, ఓబులేసు, అబ్దుల్లా, సూరి పాల్గొన్నారు.

ఎన్ఐసీలో రాణించిన విద్యార్థికి అభినందన

గుంతకల్లుటౌన్: మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గత నెల 16 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించిన ఎన్ఐసీ (జాతీయ సమైక్యతా శిబిరం)లో ప్రతిభ కనబరిచి న ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్స రం విద్యార్థి బాలనారాయణను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు అభినందించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు డాక్టర్ జనార్దన్ శాస్త్రి, అకాడమిక్ కోఆర్డినేటర్ శివశంకర్ శర్మ, బసవరాజు, అల్తాఫ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డు శివారులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందర వెళ్తున్న ఆటోను వెనుక నుంచి బైక్ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు, ధనుంజయ గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పశువైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

యాడికి: పశు వైద్య విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని కోరుతూ సీపీఐ నాయకులు మండలంలోని పశువుల ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. పశు వైద్య విద్యార్థుల స్టైఫండ్ హ్యూమన్ వైద్య విద్యార్థులతో సమానంగా ఇవ్వాలని రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు శుక్రవారం యాడికి పశు వైద్యాధికారి విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజక వర్గం కార్యదర్శి ఓబిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి రఫి, నాయకులు వడ్డే రాముడు, రైతు సంఘం నాయకులు ఆదిరంగారెడ్డి, చిన్న కుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలం తురకపల్లిలో శివశంకర్‌రెడ్డి(43) అనే వ్యక్తి అప్పుల బాధతాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివశంకర్‌రెడ్డి మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేశాడు. కుటుంబం పోషణ బరువై, అప్పులు తీర్చడానికి వీలులేక ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ అమనుల్లా తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ మృతి

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సరస్వతి(52) అనే మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయసముద్రం మండలం కె.కె.అగ్రహారానికి చెందిన సరస్వతి కుటుంబసభ్యులతో కలసి రెండు రోజుల క్రితం కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. రాత్రి అక్కడ నిద్ర చేసి గురువారం ఉదయం స్వగ్రామానికి వెళ్తుండగా శ్రీపురం గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన సరస్వతిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. సరస్వతి అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.